ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.0
కనిష్ఠం 17.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 28 నవంబరు 2025





గెలుపు గుర్రాలపై ఆరా!





గ్రామపంచాయతీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాల్లో జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ జారీచేసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో అన్ని పార్టీలు కూ డా గెలుపు గుర్రాలపై ఆరా తీస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మంగా తీసుకున్న పార్టీలు
- బలమైన అభ్యర్థులకు రంగంలోకి దింపేందుకు సన్నాహాలు
- ముఖ్యనేతలతో పార్టీల అధిష్ఠానం చర్చలు
- మొదటి విడతలో నామినేషన్లు షురూ

మొదటి విడతలో జరిగే గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, తదితర పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాగా వేయాలని వ్యూహాలు రచిస్తున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల జాబితాలు ప్రధాన పార్టీలు సిద్ధం చేసుకున్నాయి. అయితే సర్పంచు స్థానాలకు పోటీ చేసేందుకు ఆశావహులు అధికంగా ఉండటంతో అసంతృప్తులు ప్రారంభమయ్యాయి. దీంతో పలు పార్టీల్లో చేరికలు, అలకలు వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం లేకుండా పార్టీల అధిష్ఠానాలు రంగంలోకి దిగుతున్నాయి. సీనియర్ నేతలతో సంప్రదింపులు జరుపుతూ, పార్టీ నేతలను సమన్వయం చేసే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ఎవరెవరు ఏ పార్టీ నుంచి రంగంలో ఉంటారన్నది ఇప్పటికీ స్పష్టంకాలేదు. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, తదితర పార్టీల నేతలు స్థానిక ఎన్నికలపై మండలాలవారీగా సమావేశమైనట్లు సమాచారం. గ్రామ సర్పంచు, వార్డు స్థానాల్లో గెలుపు గుర్రాలపై ఆరాతీశారు. మండల అధ్యక్షులు, గ్రామశాఖ అధ్యక్షులతోపాటు సీనియర్ నాయకులతో చర్చలు ప్రారంభించారు. అయితే గ్రామాల్లో ఏకగ్రీవంగా ఒకపార్టీ నుంచి ఫలానా అభ్యర్థికి మద్దతు తెలియజేస్తామన్న పరిస్థితి కన్పించడంలేదు. దీంతో అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. మరోవైపు స్థానిక ఎమ్మెల్యేతోపాటు అధిష్ఠానం పెద్దల సహకారంతో గ్రామాల్లో సర్పంచ్‌గా, వార్డుసభ్యులుగా పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ బెర్త్‌లను ఖరారు చేసుకుంటున్నారు. అధిష్ఠానం పెద్దలు భరోసా ఇవ్వడంతో రంగంలో ఉండేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లోని అన్ని కులసంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలతో సమావేశమవుతున్నారు. రిజర్వేషన్ల కారణంగా గతంలో పోటీ చేయలేకపోయిన స్థానిక నాయకులకు..., ప్రస్తుతం రిజర్వేషన్లు అనుకూలంగా రావడంతో ఈసారి కచ్చితంగా బరిలో ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు సర్పంచ్‌గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తున్నారు. పార్టీ నేతలు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎవరికి మద్దతు...

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ 1వ రోజు				
జిల్లా	27న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	421	421	234	234
సూర్యాపేట	207	207	38	38
యాదాద్రి	205	205	134	134
మొత్తం	833	833	406	406

మొదటివిడతలో నామినేషన్లు షురూ..!

జిల్లాలో మొత్తం 427 గ్రామపంచాయతీలు, 3,704 వార్డులు ఉన్నాయి. ఈ నెల 11న మొదటి విడత పోలింగ్ జరుగుతుంది. జిల్లాలో మొదట విడతలో 153 గ్రామపంచాయతీలు, 1,286 వార్డుసభ్యులకు ఎన్నికలు జరుగనున్నాయి. భువనగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో ని ఆలేరు, రాజాపేట, యాదగిరిగుట్ట, ఆత్మకూరు, బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. భువనగిరి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో మొదటి విడతలో జరిగే ఎన్నికల కోసం అవసరమైన సామగ్రి, బ్యాలెట్ పెట్టెలను మండల కేంద్రాలకు తరలించారు. పోలింగ్ నిర్వహించే సిబ్బందితోపాటు నామినేషన్ల స్వీకరణకు కావాల్సిన సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

అన్నదాన సత్ర భవనానికి ముహూర్తం ఖరారు

- సుమారు రూ.23కోట్ల వ్యయం
- రోజుకు 5వేల మంది భక్తులకు అన్నప్రసాదం

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి అన్నదాన సత్ర భవనం ఎట్టకేలకు ప్రారంభానికి నోచుకోనుంది. స్వయంభువులను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం అత్యాధునిక అన్నదాన సత్ర భవనాన్ని ఈ నెల 30న ప్రారంభించేందుకు ఆలయ అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ మేరకు ఆలయ అధికారులతో ఈవో ఎస్. వెంకట్రావు నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

- (ఆంధ్రజ్యోతి,యాదగిరిగుట్ట)

అన్నసత్ర భవనం నిర్మాణానికి హరేరామ హరే కృష్ణ ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థలతో సంప్రదింపుల అనంతరం గండిచెరువు సమీపంలో వైటీడీఏ డిజైన్ రూపొందించగా, మొత్తం సుమారు 2.07 ఎకరాలు కేటాయించారు. రూ.23కోట్లతో సుమారు 1.20 ఎకరాల్లో భవనాన్ని ఆధునికంగా నిర్మించారు. 2021లో ప్రారంభించిన భవన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన వేగేశ్న అనంతర కోటీ రాజు రూ.14కోట్లు విరాళంగా ఇచ్చారు. మిగత పనులకు కావాల్సిన నగదును వైటీడీఏ (భవనం పునాదులు), దేవస్థానం (గ్యాస్‌స్టౌవ్, పైపులైన్, బాయిలర్లు, ఇతర సామగ్రి) భాగస్వామ్యంతో అన్నదాన సత్ర భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వంట పరికరాలు, పాత్రలు శుభ్రం చేసే యంత్రాలను ఇక్కడ ఏర్పాటు..

- మిగతా 8వ పేజీలో...



కొండకింద అన్నదాన సత్ర భవనం

నేటి చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230

ఎన్నికల నిర్వహణ సందేహాలుంటే 9550447329కు ఫోన్ చేయండి

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సందేహాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులు ఏవైనా ఉంటే ఎన్నికల సాధారణ పరిశీలకురాలిగా ఐఏఎస్ అధికారి పీ.గౌతమి సెల్ నెంబర్ 9550447329లో సంప్రదించవచ్చు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ, నిర్వహణపై గురువారం జిల్లాకు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లోని మొద టి అంతస్తులో ఉన్న స్టేట్ చాంబర్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

సర్పంచ్, వార్డు సభ్యుల వేలంపై కఠిన చర్యలు

గ్రామపంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను వేలం ద్వారా దక్కించుకోవాలని ప్రయత్నిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు ప్రారంభమయ్యాయని, ప్రజాస్వామ్య వ్యవస్థలో అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించాలన్నారు. అలాకాకుండా వేలం పద్ధతిలో దక్కించుకోవడం నేరమన్నారు. జిల్లాలో సర్పంచులకు, వార్డు సభ్యుల పదవులకు వేలం నిర్వహించినా, ప్రయత్నించినా టోల్ ఫ్రీ నెం:8978928637కు సమాచారం ఇవ్వాలన్నారు.

నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి



పాముకుంట నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రాజాపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి తెలిపారు. గురువారం రాజాపేట మండలం రఘునాథపూర్, నెమిల, బొందుగుల, జాల, పాముకుంట నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాలవద్ద ఏర్పాట్లను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిర, ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కిషన్, ఆర్ఐ నర్సింహులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత



బాల్య వివాహాలను అరికడతామని మోత్కూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని మోత్కూరు ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.స్వామి అన్నారు. గురువారం స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098కిగాని, 100కు ఫోన్‌చేసి చెప్పాలన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వారికి వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు తోడ్పడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కోప్ సంస్థ మండల కోఆర్డినేటర్ కుర్మేటి యాదయ్య, ఉపాధ్యాయులు వై.మల్లిఖార్జున్, హరికృష్ణ, భీమాంజనేయులు పాల్గొన్నారు.

నీటి వనరుల గణనను విజయవంతం చేయాలి

సీపీవో ఎంఆర్ వెంకటరమణ

భువనగిరిరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):నీటి వనరుల గణన సర్వేను విజయవంతంగా నిర్వహించాలని సీపీవో ఎంఆర్ వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు నిర్వహించిన శిక్షణలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రతీ ఐదేళ్లకోసారి చిన్న తరహా నీటి వనరుల గణన చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న 7వ చిన్న తరహా సాగు నీటి వనరుల గణనకు సంబంధించి బోరు, బావులు, చెరువులు, కుంటలకు సంబంధించిన వివరాలను స్మార్ట్ ఫోన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్ అంజిరెడ్డితో, డిప్యూటీ గణాంక అధికారి శ్రీనివాస్, ఏవో మల్లేశ్, ఎంపీఎస్‌వో బాలనర్సింహ, ఏపీవో బాలస్వామి, ఐబీ ఏఈ భరత్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలి

సాధారణ పరిశీలకురాలు గౌతమి

భువనగిరి(కలెక్టరేట్),నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నోడల్ అధికారులు విధులను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకురాలు పీ.గౌతమి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావులతో కలిసి ఎన్నికల నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదటి విడత ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలను అదనపు కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృతిక, డీఆర్డీవో నాగిరెడ్డి, డీఈవో సత్యనారాయణ,నోడల్ అధికారులు ఉన్నారు. కలెక్టర్ హనుమంతరావు కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ప్రారంభించారు.



నోడల్ అధికారులతో సమీక్షలో జనరల్ అబ్జర్వర్ గౌతమి, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కరరావు

అధికారులు నిష్పక్షపాతంగా ఉండాలి

ఆలేరు: గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్టేజ్-2 అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కలెక్టర్ హనుమంతరావు కోరారు. ఆలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీ ఎన్నికలపై స్టేజ్-2 అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతోపాటు పోలింగ్ రోజు పోలీస్ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఉపసర్పంచ్ ఎన్నిక కూడా స్టేజ్-2 అధికారే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ అంజనేయులు, శిక్షణ అధికారులు దూడల వెంకటేష్, ఎం.తిరుపతిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలి

ఆలేరు రూరల్: నామినేషన్ వేసే ప్రక్రియలో అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. గురువారం మండలంలోని కొలనుపాకలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నియమావళిలోనే నామినేషన్ పత్రాలు స్వీకరించాలని హెల్ప్ డెస్క్ సహకారాన్ని అభ్యర్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, పీఏసీఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు.


ఆహ్లాదానికి కేరాఫ్ పెద్దచెరువు

- సాగుతున్న పెద్ద చెరువు కట్ట అభివృద్ధి పనులు
- ఆకర్షణీయంగా వ్యూపాయింట్, పంప్‌హౌస్, ఓపెన్ జిమ్

భువనగిరిటౌన్,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మందగమనంగా సాగిన భువనగిరి పెద్ద చెరువుకట్ట సుందరీకరణ పనులు ఇటీవలే వేగవంతమయ్యాయి. ఇప్పటికే వేర్వేరు ప్యాకేజీల్లో పలు ప్రతిపాదిత పనులు కాగా, మరో ప్యాకేజీలో రెండేళ్ల క్రితం ప్రారంభమైన పనుల్లో కీలకమైన వ్యూపాయింట్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్ పనులు చివరి దశకు చేరాయి. మిగతా పనులు కూడా త్వరలో పూర్తి చేసేందుకు అధికారులు పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదించిన పనులన్నీ పూర్తయితే చెరువు కట్ట ఆహ్లాదానికి మారుపేరుగా నిలువనుంది.

ఇటీవల రూ.2కోట్లతో పనులు

ఇటీవల మునిసిపల్ కౌన్సిల్ హయాంలో రూ.2కోట్లతో లవ్ భువనగిరి, 30 ఫీట్ల జాతీయ జెండా దిమ్మె, 60కి పైగా ఐమాక్స్ లైట్లు, పిల్లల ఆట వస్తువుల ఏర్పాటు, మార్నింగ్ వాకర్స్‌కు అనువుగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో చెరువు కట్టను పూర్తిస్థాయిలో.., శాశ్వతంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు రూ.6 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు 2023, ఆగస్టు 21న శంకుస్థాపన చేశారు. టెండర్ నిబంధనల ప్రకారం ఏడాదిలోపు పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ నేటికీ పనులు సాగుతూనే ఉన్నాయి. గ్రీనరీ, వాకింగ్ పాత్, సుందరీకరణ పనులు, చెరువు కట్ట బలోపేతం తదితర పనులు పూర్తి కాగా తాజాగా చేపట్టిన వ్యూపాయింట్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్ పనులు చివరిదశకు చేరాయి. వ్యూ పాయింట్ పనులు పూర్తయితే అక్కడినుంచి ఒక వైపు చారిత్రక భువనగిరి ఖిల్లా, పట్టణ స్వరూపాన్ని మరో వైపు పెద్దచెరువు జలసిరులను, టెంపుల్ జోన్‌ను ఇతర ప్రకృతి అందాలను వీక్షించవచ్చు. ఓపెన్ జిమ్ వాకర్స్‌కు ఉపయుక్తంగా, చిల్డ్రన్స్ పార్క్ పిల్లలకు ఆటవిడుపుగా ఉండనుంది. అలాగే స్నాక్ బార్ కూడా ఏర్పాటు చేయనున్నారు. చెరువు నీటినుంచి ఆహ్లాదాన్ని పొందేలా, అందాలను వీక్షించేలా పంప్ హౌస్ వరకు ఇరువైపులా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. ప్రతిపాదిత పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



భువనగిరి పెద్ద చెరువు

పనులు సాగుతున్నాయిలా..

భువనగిరి పెద్ద చెరువు కట్ట బలోపేతం,అభివృద్ధికి గతంలో పలుమార్లు ప్రతిపాదించారు. చెరువుకట్ట బలహీనంగా ఉండటంతో చెరువు నిండిన కొన్ని రోజులకే నీరంతా లీకేజీలల రూపంలో వృధా అయ్యేది. ఈక్రమంలో సుమారు 25ఏళ్ల క్రితం చెరువును తాగునీటి రిజర్వాయర్‌గా మార్చే లక్ష్యంతో పంప్ హౌస్‌ను నిర్మించి,గొలుసు కట్టు చెరువులకు, పంటల సాగుకు చెరువు నీటి విడుదలను నిలిపివేశారు. అనంతరం సుమారు 18ఏళ్ల క్రితం సుమారు రూ.15లక్షలతో అవసరమున్న చోట చెరువు కట్టకు మరమ్మతు చేశారు. పదేళ్ల క్రితం మిషన్ కాకతీయలో భాగంగా రూ.3కోట్లతో పూడిక తీత, మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దే పనులు, చెరువు కట్ట రాసకాలువ మరమ్మతు



పనులు చేపట్టారు. ఏడేళ్ల క్రితం అర్ధరాత్రి చెరువు కట్టకు పడిన గండితో నీరంతా రహదారులపైకి వచ్చి హెచ్‌బీకాలనీ, సింగన్నగూడెం, తదితర బస్తీల్లోకి చేరింది.దీంతో అప్పటికప్పుడు అధికారులు చెరువు రెండు అడుగుల ఎత్తు తగ్గించడంతో ముప్పు తప్పింది.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ

- కేసీఆర్ వల్లే రాష్ట్ర ఏర్పాటు కల సాధ్యమైంది
- దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

7



నల్లగొండలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

కాంగ్రెస్ జెండా దిమ్మెలు ధ్వంసం

- తుప్రాన్‌పేట, దండుమల్కాపురం గ్రామాల్లో కూల్చివేసిన జాగృతి నాయకులు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసు నమోదు

6

ఇన్‌సైడ్



యాదగిరీశుడికి

నిత్య పూజలు

- రూ.18.33లక్షల ఆదాయం
- సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఈవో

7



పంచాయతీ ఎన్నికల్లో

గుర్తు.. గమ్మత్తు

- సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు అభ్యర్థులకు 20 గుర్తులు
- గుర్తుల్లో ఒకేలా కన్పిస్తున్న చాయ్‌జాలీ, మూకుడు

6



గురుకులంలో

ప్రకృతి ప్రసాదం

- సాగర్ గురుకులంలో విద్యార్థులకు జీవిత పాఠాలు
- పాఠశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం

6

పంచాయతీల్లో సందడి





పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆ ప్రాంతాలన్నీ సందడిగా కనిపిస్తున్నాయి. నామినేషన్ల సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు ఒకేసారి కార్యాలయంలోకి వెళ్లడం, రిటర్నింగ్ అధికారి వద్దే తప్పులు సరిచూసుకోవడం చేస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తూ ఫొటోలు దిగుతున్నారు.
(ఆంధ్రజ్యోతి-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి)

నిబంధనలు ఉల్లంగిస్తూ అధికసంఖ్యలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు

పంచాయతీ ఎన్నికల్లో గుర్తు.. గమ్మత్తు

● సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు అభ్యర్థులకు 20 గుర్తుల కేటాయింపు
● గుర్తుల్లో చాయ్‌జాలీ, మూకుడు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)
పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. ఎన్నికల సంఘం సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డులకు 20 ఎన్నికల గుర్తులు కేటాయించింది. సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికల గుర్తులు కేటాయించారు. సర్పంచ్ బ్యాలట్‌లో, వార్డు సభ్యుల బ్యాలెట్‌లో నోటా ఉంటుంది. సర్పంచ్ బ్యాలెట్ పేపర్ పింక్ కలర్‌లో, వార్డు సభ్యుల బ్యాలెట్ పేపరు వైట్ కలర్ ఉండనుంది.

సర్పంచ్ అభ్యర్థులకు
రింగు (ఉంగరం), కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టీవీ రిమోట్, టూత్‌పేస్ట్, స్పానర్(పానా), చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్‌జాలీ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, స్టంప్స్ గుర్తులు కేటాయించారు.



సర్పంచ్ అభ్యర్థుల గుర్తుల్లో చాయ్‌జాలీ

వార్డు అభ్యర్థులకు
గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్ (ఈల), కుండ, డిష్ యాంటినా, గరాట(గౌర), మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాసు, పోస్టు డబ్బా, కవర్(ఎన్వలోప్), హాకీ స్టిక్ బాల్, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ స్తంభం, టీ కెటిల్ కేటాయించారు.

కొన్ని గుర్తులపై పెదవి విరుపు
సర్పంచ్, వార్డులకు కేటాయించిన ఎన్నికల గుర్తులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవేం గుర్తులని పెదవివిరుస్తున్నారు. అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు అక్షర క్రమంలో గుర్తులు కేటాయిస్తారు. తమకు ఏ గుర్తు వస్తుందో, గ్రామీణ ఓటర్లు దాన్ని సరిగా గుర్తిస్తారో లేదోనని మదన పడుతున్నారు. మంచం, టేబుల్, బ్లాక్‌బోర్డు, పలక, బిస్కట్ లాంటి వాటిల్లో కొన్నింటి పోలిక దగ్గరగా ఉంటుందంటున్నారు. స్టంప్స్, హాకీ స్టిక్ నిరక్షరాస్యులకు ఏం తెలుసని ప్రశ్నిస్తున్నారు.

వార్డు మెంబర్ల అభ్యర్థుల గుర్తుల్లో మూకుడు



నామినేషన్ డిపాజిట్లు ఇలా
సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ అయితే రూ.1000, ఇతరులలైతే రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.250, ఇతరులకు రూ.500 డిపాజిట్ చెల్లించాలి.

ఎన్నికల ఖర్చు పరిమితి దాటొద్దు
పంచాయతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులకు వ్యయ పరిమితి విధించారు. 5వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.50వేలు, 5 వేల జనాభా లోపు ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.30 వేలకు మించి ఖర్చు చేయరాదు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అధికారుల నిఘా ఉంటుంది.

లారీడ్రైవర్‌కు జైలు, జరిమానా

నిడమనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అతివేగంగా లారీని నడిపి నలుగురి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి టీ.స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైసన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం 2017 జనవరి 2న నాగార్జునసాగర్ సమీపంలోని దయ్యాల గండి వద్ద ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్ బోల్తా పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఆ సమయంలో సిమెంట్‌లోడుతో మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని డ్రైవర్ అతివేగంగా నడపి పలువురిని ఢీకొనడంతో ఇద్దరు పోలీసులతో పాటు మరో ఇద్దరు చనిపోయారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది గాయపడ్డారు. లారీ డ్రైవర్ డిండి మండలం పాంపాడ్‌కు చెందిన మాధవరం రామేశ్వర్‌రావుపై సాగర్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సోమ్లానాయక్ ఫిర్యాదు మేరకు విజయపురి టౌన్ పీఎస్‌లో కేసు నమోదు కాగా సాగర్ సీఐ పార్థసారధి, ఎస్ఐ గౌరీనాయుడు విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కాగా కోర్టులో గురువారం కేసు విచారించిన న్యాయమూర్తి స్వప్న నిందితుడి నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ శేఖర్ విచారణకు సహకరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు, ఐదుగురికి జరిమానా

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నల్లగొండ కోర్టు ఒకరికి జైలుశిక్షతో పాటు ఐదుగురికి జరిమానా విధించినట్లు నల్లగొండ జిల్లా కేంద్ర ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య తెలిపారు. నల్లగొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిలో ఐదుగురికి రూ.4,500జరిమానా విధించగా మరొకరికి ఒక్కరోజు జైలుశిక్షతో పాటు రూ.500జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందన్నారు. పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలు ప్రజల ప్రాణ రక్షణ కోసమని, ప్రజలు పోలీసులకు సహరించాలని కోరారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు రేపు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29 నుంచి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. జూనియర్ విభాగంలో అండర్-18, సీనియర్స్ విభాగంలో 18 నుంచి 54ఏళ్లలోపు వారికి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు చెస్, రన్నింగ్, షార్ట్‌పుట్, క్యార మ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన వారిని హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలన్నారు.

మృతదేహం లభ్యం

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, చిట్యాల రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ బీ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 10.50 గంటల సమయంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రామన్నపేట-చిట్యాల రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారీ కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండగా స్థానికులు సమాచారం అందించారని తెలిపారు. మృతుడు ఎత్తు 5.5 ఎత్తు, గుండ్రటి ముఖం, నలుపు రంగు, బట్టతల, తెల్లగడ్డం, వైట్ కలర్ షర్ట్ స్వచ్ఛభారత్ అని ఇంగ్లీషులో రాసి ఉన్నఆఫ్ వైట్ టీషర్ట్, కాళ్లకు శాండిల్స్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నల్లగొండ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఏమైనా సమాచారం తెలిస్తే 8712 658595 ఫోన్ నెంబరుకు సమాచారం తెలపాలన్నారు.

పోరాడేవారిని గెలిపించాలి

మద్దిరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి పిలుపునిచ్చారు. మద్దిరాల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి పోలోజు సైదులు, నాయకులు కల్లెపల్లి భాస్కర్, దీకొండ ఉపేందర్, మల్లారెడ్డి, మల్లారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రకృతి ప్రసాదం

● పాఠశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని గురుకుల పాఠశాల చదువుతో పాటు జీవిత పాఠాలను నేర్పిస్తోంది. ఎలా బతకాలి, తమ పనులు తామే ఎలా చేసుకోవాలని నేర్పిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అదేసమయంలో నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించేందుకు పాఠశాల ఆవరణలోనే ప్రకృతి(ఆర్గానిక్) వ్యవసాయం చేయిస్తున్నారు. కూరగాయలు సాగు చేస్తూ వాటితోనే రుచికరమైన భోజనం అందిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



ఆకుకూరలు కోస్తున్న సిబ్బంది





వరినాట్లు వేస్తున్న విద్యార్థులు, తూకం వేసిన కూరగాయలు

నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఆర్గానిక్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆహార పంటలపై అవగాహన కల్పిస్తూ, ఆర్గానిక్ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. వాటితోనే ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందిస్తున్నారు. ఆహార ఉత్పత్తుల కోసం రైతులు ఎంత కష్టపడి పండిస్తారో తెలుసుకోవడానికి ఈ కిచెన్ గార్డెన్ ఉపయోగపడుతోంది. ఈ గార్డెన్ సాగును ఉన్నతాధికారులు సైతం సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎకరం స్థలంలో వరితో పాటు బెండ, గోకర కాయలు, మెంతి కూర, గోంగూర, పాలకూర, చుక్క కూర, బచ్చలి కూర, పుదీనా, కోతిమీర, తోటకూర, మిర్చి, బంతి పూల సాగు చేపట్టారు.

ప్రతిరోజూ ఆకుకూర పచ్చడి
ఆర్గానిక్ గార్డెన్‌లో చేపట్టిన కూరగాయల సాగుతో వచ్చిన పంటను ఏరోజు కారోజు వినియోగిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం భోజనంలో ఒక ఆక కూర పచ్చడి చేసి వడిస్తున్నారు. అంతేకాకుండా వారానికి 50 కిలోల పచ్చి మిరపకాలు దిగుబడి సాధిస్తున్నారు. అన్ని రకాల పంటల సాగును ఆర్గానిక్ పద్ధతిలోనే చేపడుతున్నారు. ఆకుకూరలు, కూరగాయల సాగులో ఆవు పేడతో పాటు చెట్ల ఆకులతో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులను, ఆహార పదార్థాల వ్యర్థాలను మాత్రమే వినియో గిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

సామాజిక బాధ్యత అలవర్చుకునేలా
పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా గార్డెన్‌లో పెంచిన పువ్వులతో అలంకరిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థుల పుట్టిన రోజులను వేడుకగా చేయడంతో పాటు పాఠశాల తరుపున మొక్కను అందజేసి, దానిని పెంచే బాధ్యతను విద్యార్థికి అప్పగిస్తున్నారు. దీంతో పాఠశాల ఆవరణ పచ్చదనంతో నిండిపోవడంతో మొక్కల పెంపకం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహనతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకునేలా చేస్తున్నారు. గార్డెన్‌లో పండించిన పంటలతో నాణ్యమైన భోజనంతో పాటు ఖర్చు కూడా తగ్గిందని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

ఆరోగ్యకర భోజనం అందిస్తున్నాం



పాఠశాల ఆవరణలోని గార్డెన్‌లో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేపట్టాం. అక్కడ పండించిన ఆకుకూరలు, కూరగాయలతోనే నాణ్యమైన ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్నాం. పప్పులో ఏదో ఒక ఆక కూర వేసి వండిస్తున్నాం. అంతేకాకుండా రాత్రి భోజనంలో ఆకు కూర పచ్చడి ఉండేలా చూస్తున్నాం. బంతి పూల సాగుతో ఏ కార్యక్రమానికైనా బయట నుంచి పూలు కొనడం మానేశాం.
రవికుమార్, బీసీ గురుకుల ప్రిన్సిపాల్

రుచికరమైన కూరలు తింటున్నాం



పాఠశాల ఆవరణలో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో చేసిన రుచికరమైన వంటలను తింటున్నాం. ప్రతి రోజూ నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు.
జే అనిల్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి

అమ్మానాన్నల కష్టం తెలుస్తోంది



పాఠశాల ఆవరణలోని ఆర్గానిక్ గార్డెన్‌తో రైతులు, అమ్మానాన్నల కష్టం అర్థమవుతోంది. ఎంత కష్టపడి పండిస్తారో అని తెలవడంతో అమ్మ, నాన్నలు పడే కష్టం తెలుస్తోంది. చదువుతో పాటు సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం ఎలా చేయాలో నేర్చుకుంటున్నాం.
కే దినేష్, 8వ తరగతి, విద్యార్థి

కాంగ్రెస్ జెండా దిమ్మెలు ధ్వంసం

● తుప్రాన్‌పేట, దండుమల్కాపురం గ్రామాల్లో కూల్చివేసిన జాగృతి నాయకులు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ దిమ్మెలను బుధవారం అర్ధరాత్రి తెలంగాణ జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లలో తగ్గింపు నిర్ణయాన్ని నిరసిస్తూ జాగృతి నాయకురాలు కవిత ఇచ్చిన పిలుపు మేరకు మండల పరిధిలోని దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ దిమ్మెలను ఇతర ప్రాంతాలకు చెందిన జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేశారు. స్థానిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జెండా దిమ్మెలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కూల్చివేశారని భావించారు. తర్వాత పోలీసుల విచారణలో జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి.

వీడియోల ఆధారంగా కొంత మంది జాగృతి కార్యకర్తలను ఇతర ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. జెండా దిమ్మెల ధ్వంసంతో దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయ. మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రామాలకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పబ్బు రాజు గౌడ్, తాడూరి వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెన్‌రెడ్డి రాజు పాల్గొన్నారు.



తుప్రాన్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తి శ్రద్ధలతో తిరుపతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



బోనం సమర్పించేందుకు వెళ్తున్న వెల్లటూరు గ్రామస్థులు

మేళ్లచెర్వు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం నూతన వెల్లటూరు గ్రామంలో లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య విగ్రహప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పూర్ణకలశాలతో గ్రామసేవ సాగించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ప్రతిష్ఠాపన జరిగింది. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో ప్రమాదం

బూడిద తీస్తుండగా కూలీలకు గాయాలు

హుజూర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని సాయిబాలాజీ రైస్‌మిల్లులో ప్రమాదం చోటుచేసుకుంది. వరి పొట్టు బూడిదను లారీలోకి లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కూలీలపై బూడిద గుట్ట కుప్పకూలింది. ఈ ప్రమాదంలో కోదాడ మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన సాధినేని దుర్గ, షేక్ ఫిరోజ్, జాన్‌బీ, షేక్ సైదాలపై బూడిదపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారికి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రైస్‌మిల్లులో బూడిదను చల్లార్చకుండా లారీలోకి లోడ్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు గాయపడ్డ కూలీలు తెలిపారు. కాగా ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితులను ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు.



గాయపడ్డ మదార్

మెడికల్ కళాశాలకు పార్థివదేహం అప్పగింత

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాలకు ఓ వ్యక్తి మృతదేహాన్ని అప్పగించేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బాలగోని శ్రీనివాస్‌గౌడ్(43) బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలియడంతో కాలనీవాసులు కుటుంబసభ్యులను పరామర్శించి శ్రీనివాస్ పార్థివదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు దానం చేసేందుకు ఒప్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ ఐకాన్ సహకారంతో డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల బాధ్యులను సంప్రదించారు. పార్థివదేహం స్వీకరణకు అంగీకరించడంతో అప్పగించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల అనాటమీ విభాగంలో హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పమాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ అమీరా అఫ్రోజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, బుట్టేడి వీరారెడ్డి, పంతులు శ్రీనివాస్, సింగం రాంమోహన్, సోమగాని శంకర్‌గౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, ముప్ప రేవన్ రెడ్డి, రాములు, ఉదయ్ కుమార్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలోని మెడికల్ కళాశాల అధికారులకు అంగీకారపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులు



పింఛన్ కోసం బారులు

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో పింఛన్ కోసం బారులు తీరిన వృద్ధులు. ప్రతి నెలా సక్రమంగా పింఛన్ ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తపాలాసిబ్బంది జహంగీర్ గురువారం నుంచే పంపిణీని ప్రారంభించారు. దీంతో 100 మందికి పైగా పింఛన్ డబ్బుల కోసం బారులు తీరారు.

రైల్వే కమాన్‌ను ఢీకొట్టిన లారీ

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు రైల్వేట్రాక్ వద్ద నిర్మించిన ఇనుప కమాన్‌ను గురువారం ఢీకొట్టింది. చిట్యాల మండలం పిట్టంపల్లి నుంచి మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని సూర్యానారాయణ రైస్‌మిల్లుకు లారీలో ఐకేపీ ధాన్యం తీసుకెళ్తున్నారు. ధాన్యం హెవీలోడ్‌తో వెళ్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఎత్తు తక్కువగా ఉన్న కమాన్‌ను తాకడంతో రోడ్డుకు అడ్డంగా కుప్పకూలి పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కమాన్‌ను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



కూలిపడిన ఇనుప కమాన్

పట్టుదలతో లక్ష్యం వైపు అడుగులు

» సినీ రంగంలో రాణిస్తున్న జాన్‌జక్కీ » సందేశాత్మక చిత్రాలు తీస్తా

తాను అనుకున్న సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకొని ముందుకు సాగుతున్నాడు సూర్యాపేట జిల్లా సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల వల్లాబాపురం గ్రామానికి చెందిన జాన్ జక్కీ అలియాస్ జక్కి కనకయ్య. చిన్నతనం నుంచే కష్టాలు ఎదురైనా అనుకున్న లక్ష్య మే ముందు కన్పించింది. ఎక్కడా రాజీపడకుండా ఒక్కో మెట్టు ఎక్కుతూ లక్ష్యం వైపు వెళ్తున్నాడు.

- ఆంధ్రజ్యోతి, సూర్యాపేట టౌన్



దర్శకత్వం వహిస్తున్న జక్కిజాన్

జాన్‌జక్కి చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయాడు. కుటుంబంలో ముగ్గురు అక్కల తర్వాత అందరికన్నా చిన్నవాడు జాన్‌జక్కి. మూడో అక్క దగ్గర ఉంటూ చదువు సాగించాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉంటూ ఫొటోగ్రఫీ నేర్చుకోవడంతో పాటు సాయంత్రం వైన్స్‌షాప్‌లో వర్కర్‌గా పనిచేశాడు. తర్వాత హైదరాబాద్‌లో ఫొటోగ్రాఫ్ షాప్‌లో పనిచేస్తూ ఈవెంట్లకు వీడియో తీసేవాడు.

దశ తిప్పిన వీడియో టేకింగ్

జక్కిజాన్ హైదరాబాద్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వీడియో తీశాడు. వీడియో తీసిన విధానం నచ్చిన ఫంక్షన్ నిర్వాహకుడు సినిమా రంగానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి పరిచయం చేయించాడు. దీంతో చిన్న చిన్న సినిమాలకు ఎడిటింగ్ చేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత వసుంధర నిలయం అనే డాక్యుమెంటరీ తీశాడు. తర్వాత సంధ్య మోషన్ ఫిక్చర్ అనే సంస్థతో కలిసి చిన్నచిన్న సినిమాలకు ఎడిటింగ్ చేసే పూర్తిగా నిమగ్నమయ్యాడు. అదే సమయంలో 2015లో కల్యాణలక్ష్మీ అనే యాడ్ తీశాడు. అదేవిధంగా దాపిని అనే చిన్న సినిమా డైరెక్ట్ చేశాడు.

ఆ సినిమా మధ్యలోనే ఆగిపోయింది. దీంతో డిప్రెషన్‌లోకి వెళ్లిన జక్కిజాన్ కొద్దిరోజుల్లోనే కథను రాసుకొని 2022లో గోల్‌మాల్ 2020 అనే సినిమా తీశాడు. ఈ చిత్రం ఆదరణ పొందింది. తర్వాత లాక్‌డౌన్ విరామం తర్వాత మాతృ అనే భారీ బడ్జెట్ సినిమాను తీశాడు. తెలుగు, తమిళ సినిమా రంగానికి చెందిన ప్రముఖ హీరో శ్రీరామ్‌తో పాటు పేరు పొందిన నటీనటులకు దర్శకత్వం వహించాడు.



సందేశాత్మక చిత్రం తీయడమే లక్ష్యం



సమాజంలో మార్పు తెచ్చేలా సందేశాత్మక చిత్రం తీయడమే లక్ష్యం. వాణిజ్య విలువలతో పాటు సందేశాత్మక చిత్రం భవిష్యత్‌లో తీస్తా. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ అనుకున్న లక్ష్యం సాధించాలి. జీవితం ఎప్పుడూ పూలబాటలా ఉండదు కష్టపడుతూ ముందుకుసాగాలి.

- జక్కిజాన్, దర్శకుడు

జీవిత పాఠాలే ఆయన కథనాలు

» గ్రామీణ వ్యక్తుల జీవితాలే ఇతివృత్తాలుగా రచనలు
» పలు టీవీ సీరియళ్లకు రచయితగా దొంగరి మహేందర్
» బుల్లితెర సీరియల్స్‌కు కథలు, మాటలు రాస్తూ గుర్తింపు



షూటింగ్ సెట్‌లో దొంగరి మహేందర్

గ్రామీణ వ్యక్తుల జీవితాలే ఆయన కథలు. తన చుట్టూ కనిపిస్తున్న వ్యక్తుల జీవితాలను చూసిన ఆయన కవితలు, కథలు రాయడం అలవాటు చేసుకున్నాడు. పదుల సంఖ్యలో బుల్లితెర టీవీ సీరియల్స్‌కు రచయితగా గుర్తింపు తెచ్చుకుంటున్నాడు సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామానికి చెందిన దొంగరి మహేందర్.

- ఆంధ్రజ్యోతి, పెన్‌పహాడ్

సినిమా రంగంపై ఆసక్తి ఉన్న మహేందర్ 2005లో హైదరాబాద్‌కు వెళ్లి దర్శకులు దాసరి నారాయణరావు, తేజ వద్ద అసిస్టెంట్ సినిమా రచయితగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వీరి సహకారంతో మొదటిసారిగా ఈ టీవీ ఈ తరం ఫిల్మ్స్‌లో రచయితగా పది సంవత్సరాల పాటు పనిచేశాడు. బుల్లితెర రచయితగా మొదటిసారి ఈ టీవీలో 2014లో 'అడదే ఆధారం' అనే సీరియల్‌కు కథ, మాటలు రాశారు. ఆ సీరియల్ ఈ టీవీలో ఎక్కువ రోజులు వచ్చింది. దీంతో మహేందర్‌కు మంచి పేరు తెచ్చిపెట్టింది. 2015లో మీనాక్షి, 2020లో అమ్మ, 2016లో గోకులంలో సీత, 2021లో అభిషేకం, 2022లో స్వాతి చినుకులు,2022లో లాహిరి లహిరి, 2023లో శతమానం భవతి, 2025లో సంధ్యారాగం వంటి సుమారుగా 20కి పైగా సీరియళ్లకు మహేందర్ రచయితగా పనిచేశారు. ఈ టీవీ తో పాటుగా జెమిని టీవీలో అవకాశం రావడంతో జెమిని టీవీకి కూడా సీరియల్ రచయితగా రాణిస్తున్నాడు. జెమిని టీవీలో వస్తున్న పౌర్ణమి,తాళి, మట్టిగాజులు, అంతులేనికథ, అమ్మోరు వంటి సీరియల్స్‌కు రచయితగా పనిచేశాడు. ప్రస్తుతం అమ్మోరు సీరియల్ షూటింగ్ దశలో ఉండగా మిగతా సీరియల్స్ జెమిని టీవిలో ప్రసార అవుతున్నాయి. మా టీవీలో ఆమె కథ(2023), కథలో రాజకుమారి(2024), వంటి సీరియల్స్‌కు రచయితగా పనిచేశారు. జీ టీవీలో వస్తున్న లక్ష్మీనివాసం (2025), రౌడీ గారి పెళ్లాం(2024), అడవాళ్లు మీకు జోహార్లు(2023) వంటి సీరియల్స్ కూడా మహేందర్ రచయితగా పని చేశారు.

వేణుగోపాల్‌రెడ్డి జీవితంపై డ్యాకుమెంటరీ

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, అమరుడు కొండేటి వేణుగోపాల్ జీవితంపై జనవరి 19 'చరిత్రలో ఒక రోజు అనే టైటిల్ తో ఒక డ్యాకుమెంట్ తీసి మాజీ సీఎం కేసీఆర్ చేత ప్రశంసలు పొందాడు దొంగరి మహేందర్. వీటితో పాటుగా 'పాప వినాశనం' అనే ఒక డెమో ఫిలింకు కథ, మాటలు, దర్శకత్వం వహించాడు. ప్రస్తుతం ఇది యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్న ఒక డెమో ఫిలింగా గుర్తింపు పొందింది. ఈ టీవీలో రోజువారీగా ప్రచారమవుతున్న సంధ్యారాగం, జెమినీ టీవీలో అమ్మోరు అనే సీరియల్స్‌కు దొంగరి మహేందర్ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు రాశారు.

సినిమా దర్శకత్వం ప్రయత్నాలు జరుగుతున్నాయి



గ్రామీణ స్థాయి నుంచి వ్యక్తుల జీవితాలను కథ వస్తువులు చేసుకొని రచయితగా మారాను. ప్రముఖ టీవీ ఛానల్స్ ప్రసారమవుతున్న సీరియల్స్‌కు స్వయంగా కథ, మాటలు రాస్తున్నాను. మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను.

- దొంగరి మహేందర్, బుల్లితెర రచయిత.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	582 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	3972 క్యూసెక్కులు
కుడికాల్వకు	9500క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	15,272 క్యూసెక్కులు
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ	నిల్
అవుట్‌ఫ్లో	15,272 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.88 టీఎంసీలు
నీటి రాక	1000 క్యూసెక్కులు
నీటి విడుదల	8000 క్యూసెక్కులు

- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644.30 అడుగులు
నీటి రాక	988.76 క్యూసెక్కులు
గేట్ల ద్వారా విడుదల	నిల్
నీటి విడుదల	1032.24 క్యూసెక్కులు

- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

-శాలిగౌరారం

హోరాహోరీగా జాతీయస్థాయి క్రీడా పోటీలు

● సెయింట్ జోసఫ్స్ సీసీఆర్ విద్యానిలయంలో 19వ సీఎస్‌ఏ క్రీడా పోటీలు



పరుగుపందెం ప్రారంభిస్తున్న ఉపాధ్యాయురాలు


కోదాడటౌన్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ సీసీఆర్ విద్యా నిలయంలో నిర్వహించిన 19వ సీఎస్ఏ జాతీయ స్థాయి క్రీడా పోటీలు, రెండో రోజు గురువారం ఉత్సాహంగా పోటాపోటీగా జరిగాయి. ప్రిన్సిపాల్ జ్యోతి పర్యవేక్షణలో క్రీడల కన్వీనర్ సిస్టర్ ఉడుముల శౌరీ, కరస్పాండెంట్ సిస్టర్ నక్షత్రం రెండో రోజు క్రీడలను ప్రారంభించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, అథ్లెటిక్స్‌లోనూ క్రీడాకారులు సత్తా చాటారు. జాతీయ స్థాయి ఇటువంటి క్రీడలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందేందుకు ఉపయోగపడతాయని కన్వీనర్ ప్రొవెన్షియల్ మంగళగిరి, ఉడుముల శౌరీ తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చిన విద్యార్థులు ఒకే వేదికపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. క్రీడలను చూసేందుకు ప్రేక్షకులు భారీగా పాఠశాలకు తరలిరావడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

30న జానకీపురంలో కబడ్డీ జిల్లా బాలుర జూనియర్ ఎంపిక

ఆలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకిపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న కబడ్డీ బాలుర జూనియర్స్ జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కమిటి ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య స్థానిక విలేకరులతో తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి తర్వాత జన్మించి, 20ఏళ్ల వయస్సులోపు, 75కిలోల లోపు బరువు ఉండాలని తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వెంట ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో వెంట తీసుకుని రావాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం ఉందని తెలిపారు. ఉదయం 9 గంటల వరకు మైదానానికి చేరుకోవాలని నాగయ్య తెలిపారు.

కోదాడ విద్యార్థికి అంతర్జాతీయ గుర్తింపు


కోదాడటౌన్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 30వ తేదీన ఆన్‌లైన్‌లో ప్రతిష్టాత్మకంగా 13 గంటల పాటు బాల సాహిత్య భేరి పేరుతో అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహించనుంది. ఈ విశేషమైన కార్యక్రమంలో పాల్గొనటానికి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి సోమ రమేష్ (10వ తరగతి) ఎంపికైనట్లు ఎంఈఓ సలీంషరీఫ్ తెలిపారు. కథ, వచన, కవిత, గేయం, పద్యం, విభాగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థులు 101 మంది కార్యక్రమంలో పాల్గొంటారు. రమేష్ కథా విభాగంలో ఎంపికయ్యాడు. రమేష్ మూడు నిమిషాల పాటు కథ వినిపించనున్నాడు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి.మార్కండేయ, తెలుగు భాష ఉపాధ్యాయులు వీరబ్రహ్మాచారి, ముక్కామల జానకిరామ్, చిన్నప్ప, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలికి తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయ కర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.



రమేష్

ఒలంపియాడ్ ఎడ్యుక్వెస్ట్‌కు కోదాడ విద్యార్థులు

కోదాడటౌన్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీఏ(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) కోదాడ ఆధ్వర్యంలో కోదాడ మండలస్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్ కాంపిటేషన్ నిర్వహించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కాంపిటిషన్లో ఒలంపియాడ్ సీనియర్స్‌లో కే.పూజశ్రీ, జూనియర్స్‌లో అన్నా ఫాతిమా ఎడ్యుక్వెస్టులో సీనియర్స్‌లో కె.పూజ, జూనియర్స్‌లో ఎస్‌కె మైమూనా ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో నిర్వహించే తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఈల్టా సూర్యాపేట జిల్లా కార్యదర్శి షహనాజ్, కోదాడ మండల కన్వీనర్ కడారు రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు ఇ.శ్రీనివాస్‌రెడ్డి, బి.కనకమ్మ, జి.సైదయ్య, బి. సైదులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కలెక్టర్ ఔదార్యం.. కళా మహోత్సవ్‌కు విద్యార్థినులు

● బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు జిల్లానుంచి 50మంది విద్యార్థినులు ● రెండు బస్సుల్లో పయనం ● బస్సులు, అల్పాహారం, భోజనం, స్నాక్స్ ఏర్పాటు

నల్లగొండటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో అదేవిధంగా ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల నుంచి 50మంది విద్యార్థినులను పంపించారు. చదువే అన్నింటికీ మూలమని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని విశ్వసించే నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తాను జిల్లాలో ఎక్కడ పర్యటించినా ముందుగా పాఠశాలలు, కేజీబీవీలను సందర్శిస్తారు. ప్రత్యేకించి విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని పరిశీ లిస్తారు. వారికి ప్రశ్నలు వేసి జవాబులు రాబడతారు. తర్వాత చాక్లెట్లు ఇచ్చి ఉత్సాహం నింపు తారు. ఇందులో భాగంగా పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థినులను తన సొంత ఖర్చుల తో విమానంలో విహారయాత్రకు పంపిన విషయం తెలిసిందే. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి విద్యార్థినిలు వెళ్లే ప్రత్యేకంగా రెండు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతోపాటు, భారతీ య సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, తదితర అంశాల్లో ప్రావిణ్యం సాధించేందుకు ప్రోత్సహించాల న్నారు. అందుకే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల నుంచి విద్యార్థినులను ఎంపిక చేసి కళా మహోత్సవ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. బస్సులతో పాటు అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్ వంటివి ఏర్పాటు చేశారు. బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన విద్యార్థులు అక్కడి రోజ్‌గార్డెన్, రాక్, నక్షత్ర, హెర్బల్ ఉద్యాన వనాలు, ఫొటో గ్యాలరీ, యోగ జోన్, మ్యూజికల్ ఫౌంటేన్లు, చిల్డ్రన్స్ పార్క్, 120ఫీట్ల ఎత్తైన ఫ్లాగ్, 150 సంవత్సరాల టాకింగ్‌ట్రీని చూసి అనుభూతి పొందారు.



కళా మహోత్సవ్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థినుల బస్సుకు జెండా ఊపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

● మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మూలమలుపైన రోజు నవంబరు 29వ తేదీ అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ అనేది పుట్టకపోతే తెలంగాణ రాష్ట్రం లేదని, అందుకే ప్రతి తెలంగాణ వ్యక్తి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నాలన్నారు. సమైక్య పాలనలో తెలంగాణ అనే పదం పలకాలంటే భయపడే రోజుల్లో కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసి ప్రజల్లోకి తెలంగాణ నినాదాన్ని తీసుకెళ్లారన్నారు. కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రే కాకుండా, తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రిగా నేటి తరానికి తెలియజేయాలన్నారు. మోదీ, చంద్రబాబు, రేవంత్ లాంటి వారు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను ఏమీ చేయలేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్లుగా సమైక్య పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు ఏజెంట్ ఇక్కడ అక్కడి ప్లాన్‌లను అమలు చేస్తున్నారన్నారు. విలువైన భూములను ఆంధ్ర ప్రాంతం నేతల వద్ద కమీషన్ తీసుకొని వారికి భూములను ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపా ల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కూసు కుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, నోముల భగత్, నాయకులు చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, రేగట్టే మల్లికా ర్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, ప్రసన్న రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

దేవరకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సులో రూ.1.10లక్షల విలువజేసే ఐఫోన్‌ను ప్రయాణికురాలు గురువారం బస్సులో మర్చిపోయి హైదరాబాద్ కర్మన్‌ఘట్ స్టేజీ వద్ద దిగిపోయారు. గమనించిన కండక్టర్ వనం యాదగిరి, డ్రైవర్ మహమ్మద్ అలీలు ప్రయాణికురాలు మర్చిపోయిన ఫోన్‌ను భద్రపరిచి దేవరకొండ ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విచారణ జరిపిన డిపో మేనేజర్ సైదులు ప్రయాణికురాలు మర్చిపోయిన ఫోన్‌ను గుర్తించారు. డ్రైవర్, కండక్టర్లు నిజాయితీగా ప్రయాణికురాలికి ఫోన్‌ను అప్పగించారు. దీంతో డిపో మేనేజర్ సైదులు డ్రైవర్, కండక్టర్‌లను అభినందించారు.



ప్రయాణికురాలికి ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కనగల్‌లో ఒకే రోజు మూడు సాధారణ ప్రసవాలు

కనగల్, నవంబరు 27:(ఆంధ్రజ్యోతి) నల్లగొండ జిల్లా కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఒకే రోజులో మూడు సాధారణ కాన్పులు జరిగాయి. రెండు రోజుల వ్యవధిలో నాలుగు కాన్పులు చేశారు. కనగల్ గ్రామానికి చెందిన బుర్రి రేణుకా, ఎస్‌లింగోటం గ్రామాలకు చెందిన ఆలకుంట్ల రేణుకా, ఐతగోని శిరీష పురిటి నొప్పులతో బుధవారం పీహెచ్‌సీలో చేరారు. డాక్టర్ రామకృష్ణ, రమణారెడ్డి పర్యవేక్షణలో స్టాఫ్ నర్స్ కవిత వైద్య సిబ్బంది గర్భిణులకు చికిత్స అందించారు. ఈ ముగ్గురికీ ఆడ శిశువులు జన్మించారు. ప్రసవాల అనంతరం తల్లులు, శిశువులు ఆరోగ్యంగా ఉండటంతో వారి బంధువులు, కుటుంబసభ్యులు డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్ర హవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 18,33,0552 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

పరిశీలిస్తూ.. పర్యవేక్షిస్తూ..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు కొండపైన గురువారం పరిసరాలు పరిశీలించారు. ముందుగా ప్రధాన కార్యాలయం ఎదురుగా పోలీసు కంట్రోల్ రూం పరిశీలించి సీసీ కెమెరాల మానిటరింగ్ సిస్టం, సెక్యూరిటీ వ్యవస్థ వాటి పనితీరు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ వేళల్లో పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రసాదాల తయారీ, క్రయవిక్రయాల కేంద్రాలు, ఉచిత ప్రసాద వితరణ పంపిణీ విధానాన్ని కొద్దిసేపు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యంగా, సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యశాలను సందర్శించి వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్యం అందించేందుకు వైద్య సదుపాయాలు అందుబాటులో బలోపేతం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.



కంట్రోల్ రూంలో కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

భువనగిరి

ఆలేరు-మునుగోడు-తుంగతుర్తి

ఊపందుకున్న నామినేషన్లు

● మొదటి రోజు సర్పంచులకు 205, వార్డులకు 134

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం ఊపందుకుంది. మొదటి విడతలో జిల్లాలో ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, ఆత్మకూరు (ఎం), బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాలల్లోని 153 గ్రామ పంచాయితీ సర్పంచులు, 1,286 వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం మొదటి రోజు 153 సర్పంచులకు గాను 205 నామినేషన్లు దాఖలు కాగా 1,286 వార్డు సభ్యులకు గాను 134 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

మండలాల వారీగా సర్పంచు, వార్డు సభ్యుల నామినేషన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
ఆలేరు	16	15	140	9
రాజాపేట	23	34	206	21
యాదగిరిగుట్ట	23	31	198	49
ఆత్మకూరు(ఎం)	23	43	192	14
బొమ్మలరామారం	35	33	284	7
తుర్కపల్లి	33	49	266	34
మొత్తం	153	205	1,286	134

మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రశాంతం



ఆత్మకూరులో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): జిల్లాలో ఆరు మండలాల్లో డిసెంబరు 11వ తేదీన నిర్వహించనున్న గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గురువారం మొదటి రోజు ప్రశాంతగా కొనసాగింది. ఆత్మకూరు(ఎం) మండలంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆర్డీవో కృష్ణారెడ్డి సందర్శించి పరిశీలించారు. మండలంలోని 23 గ్రామపంచాయతీలకు గాను 25533 మంది ఓటర్లు ఉండగా, అందులో 12890 మంది పురుషులు, 12643 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన 8 క్లస్టర్ల నుంచి 45 సర్పంచ్, 14 వార్డుసభ్యుల స్థానాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐకి చెందిన అభ్యర్థులు మొదటి రోజు నామినేషన్లు వేశారు. ఆత్మకూరు క్లస్టర్‌లో 4, సింగారంలో 4, పల్లెర్లలో 7, కూరెళ్లలో 6, రహీంఖాన్‌పేటలో 8, పల్లెపహడ్‌లో 6, కప్రాయిపల్లిలో 7, రాయిపల్లిలో 3, చొప్పున నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపిడీవో రాములునాయక్ తెలిపారు.

● యాదగిరిగుట్ట మండలంలోని 23 గ్రామ పంచాయతీలు, 198 వార్డు సభ్యులకు ఐదు క్లస్టర్లలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద స్థానిక సీఐ బొడ్డుపల్లి భాస్కర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తున్నారు. రాజాపేట మండలం లోని 23 సర్పంచ్.206 వార్డుమెంబర్లకు గాను గురువారం 55 నామినేషన్‌లు వచ్చినట్లు ఎంపిడివో నాగవేణి తెలిపారు.

● తుర్కపల్లి మండలంలో నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తుర్కపల్లి మండలంలోని 33 పంచాయతీలలో న్నికలు నిర్వహించేందుకు 8 క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గొల్లగూడెం క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌కు-3 నామినేషన్లు, వార్డులకు -1 వేశారు. వీరారెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలో సర్పంచ్- 10, వార్డులకు-5, మల్కాపూర్ క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌కు -2, వార్డులకు- 1, వాసాలమర్రి క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌కు- 4.వార్డులకు- 7, దత్తాయపల్లి క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌కు- 5, వార్డులకు-13, రుస్తాపూర్ క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌కు-9, వార్డులకు 5, తుర్కపల్లి క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌కు- 9, వార్డులకు నామినేషన్ దాఖలు చేసినట్లు ఎంపీడీఓ లెంకల ఉమాదేవి తెలిపారు.

● ఆలేరు మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా 140 వార్డులు ఉన్నాయి. 16 గ్రామ పంచాయతీలను నాలుగు క్లస్టర్లుగా విభజించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు మొదటి దశలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతుండగా గురువారం మొదటి రోజు సర్పంచ్‌కు 19 వార్డు మెంబర్‌కు 14 నామినేషన్లు దాఖలు అయ్యాయి. శారాజీపేట క్లస్టర్ పరిధిలో గొలనుకొండ, టంగుటూరు, తూర్పుగూడెం, శారాజాపేట గ్రామాలు ఉండగా కొల్లూరు క్లస్టర్ పరిధిలో కొల్లూరు, మందనపల్లి, సాయిగూడెం, శర్బణాపురం, గుండ్లగూడెం క్లస్టర్‌లో పటేల్‌గూడెం, శ్రీనివాసపురం, కందిగడతండా క్లస్టర్ పరిధిలో మంతపురి, గుండ్లగూడెం, కొలనుపాక క్లస్టర్‌లో బైరాంనగర్ రాఘవపురం గ్రామాలతో పాటు కొలనుపాక ఉంది. సర్పంచ్‌కు కొల్లూరులో-1, గుండ్లగూడెంలో -2, పటేల్‌గూడెం -2, శ్రీనివాసపురం -1, శారాజీపేట-2, టంగుటూరు -2, గొలనుకొండ -4, కొలనుపాక -1, రాఘవపురం -3, బైరాంనగర్ -1, నామినేషన్లు దాఖలయ్యాయి. కొలనుపాకలో కలెక్టర్ హనుమంతరావుతో పాటు వివిధ గ్రామాల్లో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఆలేరు సీఐ యాలాద్రి పరిశీలించారు.

మోత్కూరు మండలంలో మూడు క్లస్టర్లు

మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలంలోని గ్రామపంచాయతీలకు మూడో విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. మూడో విడత ఎన్నికలకు డిసెంబరు 3న నోటిఫికేషన్ వెలువడనుంది. అందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని పది గ్రామ పంచాయతీల నామినేషన్ల స్వీకరణకు మూడు క్లసర్లు ఏర్పాటు చేశారు. ముశిపట్ల, అనాజిపురం, పాటిమట్ల గ్రామ పంచాయతీల్లో నామినేషన్లు స్వీకరిస్తారని ఎంపీవో ఫైళ్ల జనార్థన్‌రెడ్డి తెలిపారు. ముశిపట్ల క్లస్టర్‌లో ముశిపట్ల, రాగిబావి, పనకబండ, పాలడుగు, అనాజిపురం క్లస్టర్‌లో అనాజిపురం, పొడిచేడు, దత్తప్పగూడెం, పాటిమట్ల క్లస్టర్‌లో పాటిమట్ల, దాచారం, సదర్శాపురం గ్రామపంచాయతీల నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.

అభ్యర్థుల విజయానికి ఐక్యంగా శ్రమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ గుమ్మడి అంజిరెడ్డి

సంస్థాన్‌నారాయణపురం నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా శ్రమించాలని టీడీపీ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ గుమ్మడి అంజిరెడ్డి కోరారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గురువారం టీడీపీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీ బలంగా ఉన్నచోట సర్పంచులు, వార్డు స్థానాలకు పోటీ చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని ఆయన తెలిపారు. పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని ఆయన కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు అవ్వారి సుబ్బారావు, శ్రీపతి రాంరెడ్డి, డాక్టర్ కాటేపల్లి వెంకటేష్, కొలను వేణుగోపాల్‌రెడ్డి, సీళ్ల జంగయ్య, ఎర్ర మహేష్, జగదీష్, చింటూ, నర్రి నరసింహ ,బొల్లేపల్లి భగవంతు, కడతాల స్వామి, వావిళ్ల సత్తయ్య పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై సమాచారం కోసం దరఖాస్తు

మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాలకు పీఎంశ్రీ కింది నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులు, ఆ నిధులతో చేసిన పనులు, ఖర్చుల చెల్లింపు వివరాలు బిల్లు నంబర్లతో సహా తెలుగులో సమాచారం ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు చట్టం కింద ఆ గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు గుడే మధుసూదన్ గురువారం ఎంఈవో టి.గోపాల్‌రెడ్డికి దరఖాస్తు ఇచ్చారు. నాయకులు పోచం సోమయ్య, సతీష్ ఆయన వెంట ఉన్నారు.

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

సంస్థాన్ నారాయణపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నిర్వహణను సమర్థంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై గురువారం జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేజి 2 రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంపీఓ నరసింహారావు, ట్రైనింగ్ అధికారులు నరేందర్ రెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.



సంస్థాన్‌నారాయణపురం: ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్ : భువనగిరి మండలంలో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో చిల్కూరి శ్రీనివాస్ తెలిపారు. భువనగిరి మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 39,654 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 19,592, స్త్రీలు 20,062 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 30 నుంచి డిసెంబరు 2వరకు



భువనగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, 3న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, 4న ఆర్డీవో స్థాయి అధికారికి దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నట్లు, 5న దరఖాస్తు పరిష్కారానికి అవకాశం ఉంటుందని, 6న అభ్యర్థి ఉపసంహరణకు చివరి గడువు ఉంటుందన్నారు. 6న మధ్యాహ్నం 3గంటల తర్వాత పోటీ చేయు అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. 14న పోలింగ్ ఉదయం 7గంటల నుంచి 1గంట వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయి వెంటనే అదే రోజు ఫలితాలను ప్రకటిస్తామని అనంతరం ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తామన్నారు. మండలంలో 34 గ్రామ పంచాయతీలకు గాను 294 వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు 294 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి 12 రూట్లుగా విభజించామన్నారు.

నామినేషన్ల స్వీకరణకు 11 క్లస్టర్లు ఏర్పాటు

చందుపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో చందుపట్ల, పెంచికల్ పహడ్, రామచంద్రాపురం గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను స్వీకరిస్తారు. బండసోమారంలో బండసోమారం, వీరవెల్లి, గౌసనగర్, నందనంలో నందనం, నమాత్‌పల్లి, ఎర్రంబెల్లి, అనాజీపురంలో అనాజీపురం, తుక్కాపురం, రెడ్డినాయక్ తండా, బొల్లేపల్లిలో బొల్లేపల్లి, నాగిరెడ్డిపల్లి, సిరివేణికుంట, సూరేపల్లిలో సూరేపల్లి, పచ్చర్లబోర్డు తండా, ఆకుతోటబావి తండా, అనంతారంలో అనంతారం, హన్మాపురం, తాజ్‌పూర్, కూనూరులో కూనూరు, ముస్త్యాపల్లి, చీమలకొండూరు, వడపర్తిలో వడపర్తి, మన్నెవారిపంపు, బీయన్‌తిమ్మాపూర్, కేసారంలో కేసారం, బాలంపల్లి, జమ్మాపూర్, ముత్తిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో ముత్తిరెడ్డిగూడెం, వడాయిగూడెం, బస్వాపూర్, గంగసానిపల్లిలో స్టేజ్ -1 , స్టేజ్ -2 ఎన్నికల అధికారులు నామినేషన్లను స్వీకరిస్తారు.

బాధ్యతాయుతంగా నిర్వహించాలి

వలిగొండ : ఎన్నికలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎంపీడీవో జలేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతు వేదికలో స్థానిక సంస్థల ఎన్నికల రెండో దశ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అందరూ చురుకుగా పాల్గొని రాబోయే ఎన్నికల నిర్వహణ సజావుగా సాగించేందుకు నిబంధనలను పారదర్శకంగా తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పాటించాల్సిన నిబంధనలు, బాధ్యతలను వివరించారు. సమావేశంలో ఎంపీవో సయ్యద్ అర్షుమన్ బాను, ఎంఈఓ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్నికల నిర్వహణపై స్టేజ్-2 అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ రాజు నరేశ్, బాలరాజు, చంద్రకళ పాల్గొన్నారు.

రాజాపేట: ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం నియమ నిబంధనలను పాటించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గురువారం రాజాపేట మండల కేంద్రం లోని ఉన్నత పాఠశాలలో స్టేజ్2 ఎన్నికల అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, ఎంఈవో చందా రమేష్, మాస్టర్ ట్రైనర్స్ సత్తిరెడ్డి, ఉదయ్‌కుమార్,ఎంపీవో కిషన్, పర్యవేక్షకుడు ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా చూసుకోవాలి

తుర్కపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని జిల్లా అడిషినల్ డీఆర్‌డీవో సురేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్టేజ్-2 ఆఫీసర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషినల్ డీఆర్‌డీవో సురేష్

జీసీ రిజర్వేషన్లపై మాటతప్పిన ప్రభుత్వాలు

వలిగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ప్రభుత్వాలు మాట తప్పాయని బిసి సంఘం జిల్లా నాయకుడు సాయిని యాదగిరి, పట్టణ అధ్యక్షులు నానంచర్ల రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలమీద పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన బిసి ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దివీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారంలో దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జయంత్ కుమార్, శివ, ప్రధానోపాధ్యాయుడు నర్సింహ, కవిత, అనిత, దివీస్ ప్రతినిధులు సాయికృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తైక్వాండోతో శారీరక, మానసిక దృఢత్వం

భువనగిరి గంజ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండో శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడుతుందని భువనగిరి పట్టణ సీఐ రమేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని హ్యూమన్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వరల్డ్ అకాడమీకి హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు ఆత్మరక్షణలో భాగమైన తైక్వాండో క్రీడ నేర్చుకోవడం ద్వారా శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండవచ్చుని, సరైన ఆహారపు అలవాట్లను కూడా అలవాటు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు తైక్వాండో క్రీడ ఎంతో ఉపయోగపడుతుందని, క్రీడాకారులు జిల్లా పుండి రాష్ట్ర స్థాయికి క్రీడాకారులుగా ఎదగాలని వారు కోరారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ మల్లేష్, శివ ప్రసాద్, రాధ, భరత్‌కుమార్, ప్రఫుల్‌రెడ్డి, క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ఇచ్చే నిధులకోసమే పంచాయతీ ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న దోనూరు వీరారెడ్డి

సంస్థాన్ నారాయణపురం నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని, కేంద్రం ఇచ్చే నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి అన్నారు. గురువారం నారాయణపురం మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ నిధుల కోసమే ముఖ్యమంత్రి ఎన్నికలకు వెళుతున్నాడనీ అన్నారు. నిధులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని, భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సురివి రాజు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు, భాస్కర నరసింహ, వంగరి రఘు, దాసోజు వెంకటాచారి, ఆత్కూరి రాములు, తంగళ్ల సత్తయ్య, నందగిరి జగత్ కుమార్, కుకుడాల మహేందర్ రెడ్డి, బండమీది కిరణ్, చిలువేరు వెంకటేష్, సంపతి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీకోసం కష్టపడినవారిని విస్మరిస్తారా?



సైదాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పులెపాక శ్రీనివాస్, ఆయన మద్దతుదారులు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకోసం కష్టపడి చేసినవారిని ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటించకుండా విస్మరిస్తున్నారని యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామానికి చెందిన పులెపాక శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తన మద్దతు దారులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ నమ్ముకుని గత శాసన సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విజయంకోసం ఎంతో కృషిచేశామని తెలిపారు. సైదాపురం గ్రామ సర్పంచ్‌గా ఎస్సీ మహిళలకు రిజర్వ్ అయ్యిందని తెలిపారు. దళిత కుటుంబానికి తన భార్య పులెపాక లావణ్యకు సర్పంచ్‌గా పోటీచేసే అవకాశం ఇవ్వండా మరో మహిళకు అవకాశం పార్టీనుంచి ఇవ్వడం బాధాకరమన్నారు. పార్టీ పునరాలోచన చేయంకుంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పులెపాక లావణ్యశ్రీనివాస్, పులెపాక మల్లేష్, మోత్కుపల్లి చిట్టిబాబు, పులెపాక వినయ్, పులెపాక వెంకటేష్, కొండమడుగు జహంగీర్, మోత్కుపల్లి వేణు, పాశం యాదగిరి, పులెపాక రవి , మహిళలు పాల్గొన్నారు.

అన్నదాన సత్ర భవనానికి ముహూర్తం ఖరారు

(5వ పేజీ తరువాయి)

చేశారు. సత్ర భవనంలో మౌలిక వసతులు కల్పించిన అధికారులు, దీన్ని దాతతో కలిసి ప్రారంభింపజేసేందుకు నిర్ణయించారు.

భవనంలో సౌకర్యాలు

నూతన అన్నదాన సత్ర భవనంలో రెండు డైనింగ్, రెండు వెయిటింగ్ హాళ్లు, 12 స్టోరు గదులు, కేటాయించిన భూమిలో 25శాతం వంటల గదిని నిర్మించారు. భక్తులు కూర్చోని భోజనం చేసేందుకు కుర్చీలు, టేబుళ్లు, భవన ఆవరణలో ప్రత్యేకంగా జల ప్రసాదం సిద్ధం చేశారు.

2వేల నుంచి 5వేల మంది భక్తుల వరకు

స్వయంభువు క్షేత్రంలో తొలుత 200 మందితో ప్రారంభించిన అన్నదాన పథకం 500 మందికి చేరింది. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు 1,000 నుంచి 1,500 మంది భక్తుల వరకు భోజన సదుపాయం కల్పించారు. ప్రస్తుతం గండిచెరువు సమీపంలో అరకొర సౌకర్యాల నడుమ దీక్షాపరుల మండపంలో నేలపైనే భక్తులు భోజనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక వాడల్లో అత్యాధునిక సౌకర్యాలతో నూతన అన్నదాన సత్ర భవనం అందుబాటులోకి వచ్చింది. దీంతో 2వేల నుంచి 5వేల మంది భక్తులు ఒకేసారి భోజనం చేసేలా వసతి కల్పించారు.

తరచూ వాయిదా

సత్ర భవన ప్రారంభం తరచూ వాయిదా పడుతూ వస్తోంది. 2025 ఫిబ్రవరి 23న స్వయంభువు స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక మహోత్సవాలు, మార్చి 1 నుంచి 11 వార్షిక బ్రహ్మోత్సవాలు, ఏప్రిల్ 11న స్వామి జయంత్యుత్సవాలకు రావడం, అప్పటి నుంచి దాత సమయం లభించకపోవడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది. పరిస్థితులు అనుకూలించక తరచూ వాయిదా పడుతూ వచ్చింది. భక్తుల కోరిక మేరకు దీన్ని 30న ప్రారంభించనున్నారు.

30న అన్నదాన సత్ర భవనం ప్రారంభం

ఈ నెల 30న నిత్యాన్నదాన భవనం ప్రారంభించనున్నాం. భవనం అందుబాటులోకి వస్తే నిత్యం 2వేల నుంచి 5వేల మంది భక్తులకు అన్నదానం చేసే వీలుటుంది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక వసతి కల్పిస్తాం. భక్తులకు వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం.

-భాస్కరాయణి నరసింహమూర్తి, అనువంశిక ధర్మకర్త, యాదగిరిగుట్ట

అయిలయ్య నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం



బీర్ల అయిలయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి దంటిక అశోక్‌యాదవ్

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి డీసీసీ అధ్యక్షుడు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కృషి చేస్తారని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి దంటిక అశోక్‌యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం నాయకులు కార్యకర్తలతో కలిసి అయిలయ్యను ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ బీసీ బిడ్డ అయిన బీర్ల అయిలయ్యకు డీసీసీ అధ్యక్షుడి పదవి ఇవ్వడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

కైలాష్‌నేతపై మంత్రి అనుచిత వ్యాఖ్యలు తగదు



మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతున్న బీసీరిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్

మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్‌నేతపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనుక్కు తీసుకోవాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షుడు శివార్ల శ్రీనివాస్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేసిన బీసీ నేత పున్న కైలాష్‌కు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వవద్దని మంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాయడం బీసీలను అవమానపర్చడమేనన్నారు. బీసీ నేతకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక కొందరు నాయకులు నాలుగేళ్ల క్రితం మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కైలాష్ మాట్లాడిన వీడియో ఇప్పుడు వైరల్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. కైలాష్ ఇటీవల మంత్రికి క్షమాపణ చెప్పినా ఆయన అధిష్ఠానానికి లేఖలు రాయడం సముచితం కాదన్నారు. నాయకులు కోల మహేష్, చిల్లర గణేష్, ప్రశాంత్, మహేష్ ఆయన వెంట ఉన్నారు.

గెలుపు గుర్రాలపై ఆరా !

(5వ పేజీ తరువాయి)

ప్రకటిస్తారన్న దానిపై గ్రామాల్లో చర్చలు జోరందుకున్నాయి.

ముఖ్యులతో చర్చిస్తున్న నేతలు

జిల్లాలోని మొదటి విడతలో జరిగే ఎన్నికలకు సంబంధించిన పార్టీ సీనియర్ నాయకులతో పాటు ఆశావాహులతో స్థానిక ఎమ్మెల్యేలు నేరుగా సమావేశమవుతున్నట్లు తెలిసింది. స్థానికంగా ఎవరికి మద్దతు తెలియజేయాలన్నది స్పష్టం కాకపోవడంతో అధిష్ఠానం తేల్చాలని.. నాయకులు కోరుతున్నారు. కాంగ్రెస్‌లో ఏయే గ్రామాల్లో ఎవరెవర్ని బరిలో దింపాలన్న దానిపై స్పష్టత వచ్చినట్లు తెలిసింది. అయితే పార్టీలో నుంచి చాలామంది సర్పంచ్ పదవికి పోటీపడుతుండటంతో బుజ్జగింపులు చేపడుతున్నారు. ఏకగ్రీవంగా కాంగ్రెస్ అభ్యర్థులను బరిలో దింపాలని సూచిస్తున్నారు. అయితే మండలాల్లో, గ్రామాల్లోని నాయకులు మాత్రం ససేమేరా అంటున్నారు. అయితే పార్టీ ఎవరికి మద్దతు ప్రకటిస్తారన్నది ఉపసంహరణ రోజున తెలియజేసే అవకాశం ఉంది. కాంగ్రెస్‌లో అభ్యర్థుల మధ్య తీవ్రంగా పోటీ ఉండటంతో, ఇతర పార్టీల్లో మాత్రం అంతగా ఆసక్తి చూపడంలేదు. బీఆర్ఎస్‌నుంచి గ్రామాల్లో బలమైన నాయకులను రంగంలోకి దించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి అన్ని గ్రామపంచాయతీల్లోనూ పోటీచేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు స్థానికంగా బలోపేతం చేసేందుకు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ప్రధానంగా క్షేత్ర స్థాయి నేతలను తమవైపు తిప్పుకునేందుకు అన్నిపార్టీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. గ్రామాల్లో అన్నివర్గాల్లో పట్టున్న నాయకులపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు.